అగ్ని ప్రమాద బాధితులకు సాయం



అగ్ని ప్రమాద బాధితులకు సాయం అందజేస్తున్న కొయ్యే మోషేన్‌రాజు

వీరవాసరం: బాలేపల్లి దళితపేటలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన మూడు కుటుంబాల వారిని ఆదివారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ విభాగం ఏర్పాటు చేసిన బియ్యం, వంట సామగ్రి, దుప్పట్లను మోషేనురాజు చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. మోషేనురాజు బాధితులకు కొంత ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తరపున పథకాలు, నూతన గృహాలు మంజూరు చేయించడానికి కృషి చేస్తానని అన్నారు. వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిది జాన్సన్, యర్రంశెట్టి శ్రీనివాసు, నేతలు జ్ఞాన సుందర్‌రాజు, చిక్కాల రాజు, బొంతు రమేష్, మానుకొండ ప్రదీప్ కుమార్, చికిలే మంగతాయారు, గడ్డం భాస్కర్‌రావు, మల్ల శ్యాంబాబు, గోడు షణ్ముఖ బాబు, చిలకపాటి సునీత, పడవల నాని పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలోనే బీసీలకు అధిక ప్రాధాన్యం

ఆకివీడు: పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు, పంచాయతీలకు నిధులు విడుదల చేయాల్సి ఉందని, అయితే జనగణనలో కులగణన చేయడంలో తీవ్ర జాప్యం వల్ల తీరని నష్టం వాటిల్లుతోందని బీసీ సంఘ నాయకులు పాకా సత్యనారాయణ అన్నారు. స్థానిక గౌడ కల్యాణమండపంలో ఆదివారం జనగణనలో కులగణనపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు సముచిత ప్రాధాన్యత లభిస్తోందన్నారు. నామినేటెడ్ పదవులు, ఎమ్మెల్సీ, రాజ్యసభ సభ్యుల నియామకాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బీసీలకు అధిక ప్రాధాన్యతనిచ్చిందన్నారు. జనగణన, కులగణనను రాష్ట్రాలు చేపట్టాలంటే ఆంధ్ర రాష్ట్రంలో ఒక్కరోజులోనే లెక్కింపు జరిగే అవకాశం ఉందన్నారు. వలంటీర్ వ్యవస్థతో గణన చేయడం సులభమన్నారు. జనగణనతో పాటు కులగణన నిర్వహించి ఆరు దశాబ్దాల కాలం గడిచిందన్నారు. పలువురు బీసీ నాయకులు మాట్లాడుతూ బీసీలంతా మధ్య తరగతి కుటుంబాలుగా ఉన్నందున వెనుకబడి ఉన్నారని, ఆర్థికంగా ముందుకు వెళ్లినప్పుడు, రాజకీయంగా ఎదిగినప్పుడు తగిన ప్రాతినిధ్యం లభిస్తుందని చెప్పారు. సమావేశానికి కౌన్సిలర్ కట్టా రవీంద్రనాథ్ ఠాగూర్ అధ్యక్షత వహించగా, వీరవల్లి శ్రీనివాస్, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ జగ్గురోతు విజయ్‌కుమార్, గేదల అప్పారావు, కొండేటి శివ కుమార్, బడుగు బాలాజీ, చుక్కా సత్యనారాయణ, తోట శివాజీ, బొల్లా వెంకట్రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ నాయకుడు పాకా సత్యనారాయణ

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



వీరవాసరం ఎమ్మార్కే హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

వీరవాసరం: వీరవాసరం ఎమ్మార్కే జెడ్పీ హైస్కూల్లో 1979–84 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. తమకు విద్య నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. చిన్ననాటి మిత్రులతో ఆప్యాయంగా పలకరించుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఆ నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో నూకల సాయిసుబ్బారావు, గంటా శ్రీహరి, ఎస్.గోవిందం, గోడి కరుణాకర్, జనార్థన్ వెంకటేశ్వరరావు, కె.వి.డి ప్రసాద్, పాల్గొన్నారు.

సర్రాజు.. నీ సేవలు మరువలేమయ్యా

కాళ్ల: రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజును మరువలేమని జక్కరం సర్పంచ్ కూచంపూడి పద్మావతి అన్నారు. సర్రాజు స్వగ్రామం జక్కరంలో ఆదివారం సంతాప సభ నిర్వహించారు. పలువురు నాయకులు, పెద్దలు మాట్లాడుతూ సర్రాజు రాష్ట్రంలోనే జక్కరం గ్రామానికి ప్రత్యేక స్థానం కల్పించారని కొనియాడారు. ఆయన మరణాన్ని గ్రామ ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని, గ్రామ అభివృద్ధి కొరకు ఆయన ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. గ్రామానికి పెద్దదిక్కు కోల్పోయామని విచారం వ్యక్తం చేశారు. సభలో సర్రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్రాజు కుమారులైన పాతపాటి శ్రీనివాసరాజు, యుగంధర్ వర్మలకు తామంతా ఎల్లప్పుడూ తోడుగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్రాజు సోదరులు పాతపాటి సూర్యనారాయణరాజు, కోపల్లె సొసైటీ మాజీ అధ్యక్షుడు నంద్యాల రామరాజు, మాజీ సర్పంచ్ కూచంపూడి లక్ష్మీపతిరాజు, వేగేశ్న సూర్యనారాయణరాజు, నంబూరి సతీష్, మహంకాళిరాజు, నాగరాజు, ఆంజనేయరాజు, శ్రీనివాసరాజు, సత్యనారాయణరాజు, సుబ్బరాజు పాల్గొన్నారు.



సర్రాజుకు నివాళులు అర్పిస్తున్న గ్రామస్తులు

'ఎస్సీలను చంద్రబాబు గుర్రాలతో తొక్కించారు'

ఉండి: ఎస్సీలను విభజించి పాలించాలనే పన్నాగం పన్నిన చంద్రబాబునాయుడికి వ్యతిరేకంగా పోరాడిన నాటి ఎస్సీ నాయకులను, ప్రజలను గుర్రాలతో తొక్కించి హింసించారని మాలమహానాడు రాష్ట్రాధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. ఆదివారం ఎన్నార్పీ అగ్రహారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి జయరాజు, జిల్లా అధ్యక్షుడు నేతల సువర్ణరాజులు నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీల నియామకాన్ని చేపట్టారు. మాలమహానాడు ఉండి నియోజకవర్గ అధ్యక్షుడిగా చిగురుపాటి రాజేష్, ఉపాధ్యక్షుడిగా ఆలమూరి రాజశేఖర్, కార్యదర్శిగా యరగపాటి నవమణిరాజు, యూత్ అధ్యక్షుడిగా మేడిద సాయిజగన్నాథ్, కార్యదర్శిగా నందిగం నవీన్‌కుమార్, ఉండి మండల అధ్యక్షుడిగా తొర్లపాటి భాగ్యరాజు, ప్రధాన కార్యదర్శిగా చుక్కా రవిరాజు, కార్యదర్శిగా బోసి సామ్యూల్‌రాజు, సహాయ కార్యదర్శిగా కొమ్మిన దైవాశీర్వాదం, అర్తమూరు గ్రామ అధ్యక్ష కార్యదర్శులుగా నామాల సంసోను, కాయల సంపతరావు, సంధిరాజు, రామకూరి ఆదాము తదితరులను నియమించారు. ఎస్సీ నాయకులు రంపా వెంకటేష్, యరగపాటి చిన్నా, అసినిపర్తి సువర్ణరాజు పాల్గొన్నారు.



ఎన్నార్పీ అగ్రహారంలో నూతన కమిటీతో పుష్పరాజ్

మేడిది జాన్సన్‌కు సత్కారం

భీమవరం (ప్రకాశంచౌక్): సంజీవయ్య నగర్‌లో పాస్టర్ సామ్యూల్, పెద్దలు సుమన్ సురేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ చైర్మన్ మేడిది జాన్సన్‌ను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా నియమించడంపై కృతజ్ఞతలు తెలిపారు. క్రైస్తవుల ఉన్నతి కోసం ప్రభుత్వ సహకారంతో మరింత కృషి చేస్తానని చెప్పారు.

బీసీ వసతిగృహం పరిశీలన

సాక్షి,భీమవరం: సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులను తమ ఇంటి పిల్లల మాదిరిగా చూసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి జి.గణపతిరావు హాస్టల్ సిబ్బందికి సూచించారు. పట్టణంలోని బీసీ వసతిగృహాన్ని ఆయన పరిశీలించారు. పదో తరగతి హాస్టల్ విద్యార్థులకు ప్రేరణ, పునశ్చరణ తరగతులు ఆదివారం నిర్వహించారు.విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించే విధంగా సిబ్బంది పర్యవేక్షించాలని అన్నారు. అనంతరం హాస్టల్లో భోజనాన్ని పరిశీలించారు.

రాయకుదురులో చోరీ

వీరవాసరం: రాయకుదురులో ఆదివారం చోరీ జరిగింది. గ్రామంలోని చెల్లబోయిన హరిబాబు ఇంటి ముందున్న షాపులో బంగారం, కొంత నగదును డ్రాయర్ సొరుగులో ఉంచి వెనుక ఇంట్లో నిద్రపోయారు. తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి బంగారం, నగదును అపహరించారు. ఎస్సై పి.రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేలపై దాడి

భీమవరం అర్బన్: కొత్తపూసలమర్రులో ఆదివారం కోడి పందేలు ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై డి.మోహన్‌రావు చెప్పారు. వారి నుంచి రెండు కోడి పుంజులు,రూ.3,190 నగదు స్వాధీనం చేసుకు కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై తెలిపారు.


కోరుకొల్లులో..

పాలకోడేరు: కోరుకొల్లులో కోడిపందేలపై దాడి చేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎస్.శ్రీనివాసరావు ఆదివారం చెప్పారు. వీరి నుంచి రూ.800 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు, రేపు ఆధార్ నవీకరణ

పాలకోడేరు: జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు మండలంలోని పాఠశాలలు, కళాశాలలు, నిర్దేశించిన సచివాలయాల్లో సోమ, మంగళవారాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ షేక్ హుస్సేన్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆధార్ నవీకరణ, బయోమెట్రిక్, చేర్పులు, సవరణలు ఆయా ప్రత్యేక శిబిరాల్లో అప్‌డేట్ చేస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు, ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.







నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

పాలకోడేరు: గొల్లలకొడేరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల నిమిత్తం గొల్లలకొడేరు, గరగపర్రు, మైప, యండగండి, మహాదేవపట్నం, కొండేపాడు గ్రామాలకు సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు.

ఘనంగా అలుగులమ్మ గ్రామోత్సవం

ఉండి: చెరుకువాడ గ్రామ దేవత అలుగులమ్మ అమ్మవారి 104వ జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 23వ తేదీ నుంచి జాతర మహోత్సవాలు జరుగుతుండటం తెలిసిందే. ఆదివారం అమ్మవారిని మేళతాళాలు, తీన్‌మార్ వాయిద్యాలు, బుట్టబొమ్మలు, కళారూపాలతో గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని గ్రామస్తులు దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేసి, ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతర కార్యనిర్వాహక సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేటి నుంచి ధ్వజస్తంభ పున:ప్రతిష్ఠ ఉత్సవాలు

ఉండి: ఉణుదుర్రులో వేంచేసియున్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో సోమవారం నుంచి మార్చి 1వ తేదీ వరకు ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ నడింపల్లి నర్సింహరాజు ఆదివారం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎమ్మెల్యే మంతెన రామరాజు తదితరులు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు.

వైద్య శిబిరం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మెంటే వారి తోటలో ఆదివారం పక్షవాతం, ఫిట్స్, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య శిబిరం నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రంలో విజయవాడకు చెందిన డాక్టర్ గోపాళం శివన్నారాయణ, డాక్టర్ డి.సందీప్‌వర్మ వైద్య సేవలు అందించారు. రోగులకు బీపీ, సుగర్, అవసరమైన వారికి ఈసీజీ పరీక్షలు చేశారు. వసుధ ఫౌండేషన్ సహకారంతో రోగులకు ఉచితంగా మందులను అందజేసింది. ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాద్‌రాజు, కో–ఆర్డినేటర్ ఎంవీ రామరాజు, అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ వి.రాధాకృష్ణ, ట్రస్టీ బి.వాసుదేవరావు, మల్లుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

భీమవరం (ప్రకాశంచౌక్): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా సంక్షేమ శాఖ అధికారి జీవీఆర్ కేఎస్ గణపతిరావు అన్నారు. ప్రభుత్వ బీసీ వసతిగృహాల్లో శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో ఆదివారం బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన ర్యాలీ, విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. గణపతిరావు మాట్లాడుతూ బాల్య వివాహాలను నిరోధించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒక శాఖను ఏర్పాటు చేశాయన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, వార్డెన్ టి.కుసుమ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ జి.ప్రసాద్, గంటా సుందర్‌కుమార్, అధ్యాపకులు అమూల్యరావు పాల్గొన్నారు.

వ్యసనాలతో చిత్తు

భీమవరం (ప్రకాశంచౌక్): వ్యసనాలతో జీవితాలను పాడు చేసుకోవద్దని భీమవరం రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ పి.కల్యాణ్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో సెంట్రల్ ఎక్సైజ్ దినోత్సవంలో భాగంగా భీమవరం రైతు బజార్‌లో మద్యపానం, ధూమపానం, మాదక ద్రవ్యాల వాడకం కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణ్ మాట్లాడుతూ మద్యానికి బానిస కావడం దురదృష్టమని, మద్యం మత్తులో జీవితం చిత్తు అవుతుందన్నారు. న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు. రైతులు కె.నాగన్న, పి.వీరస్వామి, రామానాయుడు, కృష్ణమూర్తి, బార్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

అశ్లీల నృత్యాలపై కేసు

ఉండి: కలిసిపూడిలో అశ్లీల నృత్యాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత గ్రామంలో నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో అశ్లీల నృత్యాలు చేస్తున్నారనే సమాచారంతో ఎస్సై కె.గంగాధరరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



